క్లుప్తంగా

సకాలంలో రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

కోడేరు: ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో పూర్తిగా చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సీఈఓ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రెన్యూ వల్ చేయకపోతే 3శాతం వడ్డీ రాయితీ వర్తించదన్నారు. రుణాలు చెల్లించడంలో ఆలస్యం వల్ల 5శాతం భరించాలన్నారు. ప్రతి రైతు రుణాలు చెల్లించి బ్యాంకుకు సహకరించాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామ మాజీ సర్పంచ్ గోలి కమలమ్మను శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

నక్షబాటకు మరమ్మతు చేపట్టాలి

చారకొండ: మండలంలోని జూపల్లి నుంచి తాండ్ర వరకు అంతర్గతంగా ఉన్న నక్షబాటను గుంతలుగా, కంపచెట్లు పెరిగి, బాట ఆక్రమణకు గురికావడంతో రాకపోకలకు అంతరాయం ఉందని జూపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. వినతిలో నక్షబాటకు రాకపోకలకు అంతరాయం లేకుండా నిధులు మంజూరు చేసి మరమ్మతు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలో రైతుల సమస్యను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు లింగయ్యగౌడ్, వెంకటయ్య, శ్రీధర్, కృష్ణయ్య, తిర్పతయ్య, జంగయ్య ఉన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలి

బిజినేపల్లి: ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని, ఆ బాధ్యత పాఠశాలల హెచ్‌ఎంలదేనని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం బాలుర ఉన్నత పాఠశాలలో ఆయా ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. కౌమారదశలో ఉన్న విద్యార్థులకు ఈ చట్టంపై పూర్తి అవగాహన కల్పించాలని, అవగాహన లేకపోవడంతో విద్యార్థులు బంగారు భవిష్యత్ కోల్పోతున్నారన్నారు. పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాల నియంత్రణతో పాటు నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘునందన్ రావు, ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌసిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

అమ్రాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని అమ్రాబాద్ యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం సీఐ శంకర్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సీఎంపై చేసిన వాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని, వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌నాయక్, శివ, లడ్డుయాదవ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అచ్చంపేటలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ



అచ్చంపేట రూరల్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శనివారం అచ్చంపేటలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని కార్గిల్ అమరులకు నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికుల త్యాగం ఎన్నటికీ మరువలేనిదన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా పట్టణంలో అంజనీమాత సేవా సమితి ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో అమరులైన వారికి కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అంజనీమాత సేవాసమితి అధ్యక్షురాలు సునీతాబాయి, కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలాజీ, రవీందర్, హేమలత, కృష్ణవేణి, మంగమ్మ, శకుంతల, లక్ష్మీబాయి, చంద్రకళ, కవిత, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

అచ్చంపేట రూరల్: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బయ్యన్న డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర మహాసభకు శనివారం అచ్చంపేట నుంచి తరలివెళ్లారు. రాష్ట్ర మహాసభలో పలు అంశాల ప్రతిపాదనలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, తిర్పతయ్య, మల్లేష్, ఆంజనేయులు, శంకర్, లింగస్వామి పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

- చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారిన రోడ్లు
- గ్రామాల్లో సీసీలకు నోచుకోని వీధిరోడ్లు
- ఏళ్ల తరబడి కొరవడిన నిర్వహణ
- అవస్థలు పడుతున్న ప్రజలు, రైతులు



బురద గుంటలుగా మారిన ఉప్పునుంతల- కొత్తరాంనగర్ రోడ్డు

ఉప్పునుంతల: ప్రస్తుతం కురుస్తున్న చిన్నపాటి ముసురు వర్షాలకే రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. గ్రామాల్లో ఇప్పటికీ వీధిరోడ్లు సీసీ రోడ్లుగా అభివృద్ధికి నోచుకోక ఇళ్లముందు బురద రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో కొన్నేళ్లుగా మట్టిరోడ్ల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారు. గ్రామాల మధ్య ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అధ్వానంగా ఉన్న రోడ్లపై ప్రయాణించడం ప్రజలకు నరకయాతనగా మారింది. కొన్ని గ్రామాల్లో అవసరంలేని చోట సీసీరోడ్లు వేసినా మరికొన్ని గ్రామాల్లో మాత్రం సీసీ రోడ్ల ఊసే లేదు. రోడ్లను బాగుచేయించడంలో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టింపులేకుండా ఉంది. అధ్వానంగా తయారైన రోడ్లపై వెళ్లడానికి ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ వరకు ఉన్న మట్టి రోడ్డు ఇబ్బందిగా ఉంది. నల్లచెరువుకట్టపై నుంచి ఉన్న రోడ్డుపై గోతులుపడి బురద గుంటలుగా మారింది. ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్ వరకు మట్టిరోడ్డు వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. మొల్గర–ఉప్పునుంతల రోడ్డుకు ఇరువైపుల రైతులు దగ్గరగా దున్నడంతో డొంకమార్గంగా తయారైంది. ఉప్పునుంతల నుంచి అచ్చంపేట రోడ్డును కలుపుతూ బైపాస్ రోడ్డుగా ఉన్న బర్లడొంక రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. మర్రిపల్లి నుంచి గట్టుతుమ్మెన్ స్టేజీ వరకు 2.5 కి.మీ. దూరం ఉన్న రోడ్డుపై కంకర తేలి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మర్రిపల్లి నుంచి లక్ష్మాపూర్ వరకు రోడ్డుపై కంకర లేసి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దాసరిపల్లి నుంచి పెద్దాపూర్ వరకు, సదగోడు నుంచి తిర్మలాపూర్ వరకు మట్టి రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. కొరటికల్ నుంచి చాకలి గుడిసెల వరకు మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. అయ్యవారిపల్లి నుంచి తండా వరకు మట్టి రోడ్డు, కొరటికల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు లింక్‌రోడ్డు పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది.



అధ్వానంగా తయారైన గుట్టమీది తండా రోడ్డు

గ్రామంలో సీసీరోడ్లు వేయలేదు..



మా ఊరు మండల కేంద్రానికి దగ్గరగా ఉందనే పేరు తప్పా అభివృద్ధికి నోచుకోలేదు. ముసురు వర్షాలకు రోడ్డుపై గోతుల్లో నీరు నిలిచి కనీసం బైక్‌లు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉంది. మా గ్రామంలో ఇప్పటివరకు ఒక్క సీసీరోడ్డు కూడా వేయలేదు. చిన్నవర్షం కురిసినా రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులకు, నాయకులకు రోడ్ల సమస్యలు చెప్పినా ఫలితం లేదు.

– పుట్ట ఈశ్వరయ్య, కొత్తరాంనగర్

మట్టిరోడ్ల అభివృద్ధికి నిధుల్లేవు..

మండలంలో మట్టిరోడ్లను అభివృద్ధి చేయడానికి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. గ్రామాల్లో గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు ప్రాధాన్యత ఉన్న కాలనీలు, వీధుల్లో సీసీ రోడ్లు వేయించుకోవాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల అనంతరం సీసీ రోడ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. మట్టి రోడ్లను మెటల్, బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపించడానికి సిద్ధంగా ఉన్నాం.

– మహేష్, పంచాయతీరాజ్ ఏఈ

కలెక్టర్‌ను పరామర్శించిన నాయకులు



కందనూలు/కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ మాతృమూర్తి శాంతమ్మ రెండు రోజుల క్రితం మృతి చెందారు. స్వగ్రామమైన జనగామ జిల్లా సూరారంలో శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్143) నాయకులు కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను పరామర్శించి శాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిలో టీయూడబ్ల్యూజే (హెచ్ 143) రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లాఖాన్,'అడుగు' డిజిటల్ మీడియా చీఫ్ ఎడిటర్ డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ, మీడియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి సందీప్ తేజ, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్ 143) నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మునగాల చంద్రశేఖర్‌రావు, జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్ కుమార్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుమ్మకొండ రాములు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు జెమినీ సురేష్, హెచ్. ఉమా శంకర్, నాగ శేషయ్య ఎస్‌పి రావుఫ్, వంగ శ్రీనివాస్ గౌడ్, బండారి శ్రీనివాసులు, శేఖరాచారి, ఏటిగడ్డ వెంకటేష్, పులిజాల సత్యం ఉన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

తాడూరు: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగంగా చేయాలని ఎంపీడీఓ అంజనేయులు కోరారు. శనివారం మండలంలోని ఎటిదారిపల్లి, అంతారం, ఇంద్రకల్, మేడిపూర్, అకునెల్లికుదురు గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, ఎంపీఓ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

వెల్దండ: మండలంలోని కుందారంతండాలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానం అందించారు. ఈనెల 31న ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ,ధ్వజ స్తంభం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పండ్ల మొక్కల పంపిణీ

కోడేరు: మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి రవితేజ ఆధ్వర్యంలో వనమహోత్సవం సందర్భంగా ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు ఎండిపోకుండా ఇంటి ముందు నాటుకోవాలని కార్యదర్శి సూచించారు. కార్యక్రమంలో కారోబార్ సాయిబాబు, మహేష్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నిల్లో సత్తాచాటాలి

అమ్రాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ జిల్లా మహిళామోర్చాఅధ్యక్షురాలు బల్మూరు జానకి అన్నారు. శనివారం అమ్రాబాద్ ఎంకే ఫంక్షన్‌హాల్లో బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు, సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, గోలిరాజు, బొద్దుపల్లి శ్రీనివాసులు ఉన్నారు.

భూ వివాదంపై ఆర్డీఓతో వాగ్వాదం

- అక్రమంగా కబ్జా చేశారు..
- న్యాయం చేయాలని బాధితుల డిమాండ్



అచ్చంపేట ఆర్డీఓ మాధవితో వాగ్వాదం చేస్తున్న బాధితులు

అచ్చంపేట: అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయంలో శనివారం భూ వివాదంలో ఆర్డీఓతో బాధితులు వాగ్వాదానికి దిగారు. 2010లో అక్రమంగా కబ్జా చేసిన 'మా భూమిని మాకు ఇప్పించి న్యాయం చేయాలి' అని డిమాండ్ చేశారు. బాధితురాలు కస్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం కొర్రతండాకు చెందిన కొర్ర కస్న కుటుంబానికి ఐనోలు శివారులోని సర్వేనంబర్ 323/అ, 324/అ, 263లో 9.04 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని హతీరాం, జానకీరామ్ మరి కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, అప్పటి ఆర్డీఓ రికార్డులో మాపేర్లు మాయం చేసి వారిపేర్లపై పాసుపుస్తకాలు ఇచ్చారన్నారు. దీనిపై 2018లో హైకోర్టుకు వెళ్లగా మూడు నెలల క్రితం రెండు నెలల్లో ఆర్డీఓ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించినా జడ్జిమెంట్ ఇవ్వకుండా నాన్చుతున్నారని, ఎవరికో ఒకరికి తీర్పు ఇవ్వమని డిమాండ్ చేస్తూ వాగ్వాదం చేశారు. కోర్టు మోకాపై ఉన్న వారికి జడ్జిమెంట్ ఇచ్చిన తర్వాత ఇరు పార్టీలకు నోటీసులు జారీ చేయడం తప్పుబట్టి కోర్టు ఆర్డీఓ మాధవికి రూ.50వేల జరిమానా విధించింది. కోర్టు మెట్టికాయలు పెట్టిన కాలయాపన చేస్తూ మమల్ని తీవ్ర మానసిక ఇబ్బందులకు గురిచేస్తోందని బాధితులు రోధిస్తూ వాపోయారు. న్యాయం జరగకపోతే ఆర్డీఓ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటామని బాధితులు బెదిరింపులకు దిగారు. కార్యాలయంలో దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆర్డీఓ పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు గొడవను నివారించడంతో సద్దుమణిగింది. భూ వివాదంలో ఇరువర్గాల వారు ఘర్షణలు పడి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.

పెడింగ్‌లో 300 భూ వివాద కేసులు

ఏజెన్సీ ప్రాంతంలోని భూములకు సంబంధించిన 300 భూ వివాద కేసులు ఆర్డీఓ కోర్టులో పెడింగ్‌లో ఉన్నాయి. ఇందులో రెండు కేసులు మాత్రమే బాధితులు రాజీ పడటంతో పరిష్కారానికి నోచుకున్నాయి. మరో 10 కేసులపై హైకోర్టు డైరెక్షన్ ఇచ్చినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు. హైకోర్టు అక్షింతలు వేస్తున్నా నిర్ణయం తీసుకోవడంలో ఆర్డీఓలు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా బాధితులు ఆర్డీఓ కోర్టు చుట్టు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ఆర్డీఓలు మారుతున్నారే తప్ప పరిష్కారం దొరకడం లేదని బాధితులు వాపోతున్నారు. రెవెన్యూ కోర్టులో సబ్ కలెక్టర్/ఆర్డీఓలు పరిష్కరించాల్సి ఉంటుంది. సబ్ కలెక్టర్ స్థాయి అధికారి ఉంటేనే పరిష్కారానికి నోచుకునే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పంచనామా నిర్వహించాలి..

హైకోర్టు రెండు నెలల్లో ఈకేసు తేల్చాలని ఆదేశాలు ఇచ్చింది. రెవెన్యూ సదస్సులు, ఇతర పనుల వల్ల ఆలస్యమైంది. మోకా మీదకు వెళ్లి పంచనామా నిర్వహించి, డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాత జడ్జిమెంట్ ఇవ్వడం జరుగుతుంది. ఇప్పటికే రెండు వర్గాల వారికి రెండు నోటీసులు ఇచ్చాం. కోర్టు ఉత్తర్వుల ప్రకారం రీ వెరిఫికేషన్ చేసిన తర్వాత తీర్పు ఇవ్వనున్నాం. ఇందుకు మరో 20రోజుల సమయం పడుతుంది.

– మాధవి ఆర్డీఓ అచ్చంపేట

సీజనల్ వ్యాధులపై తస్మాత్ జాగ్రత్త



పాలెం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బిజినేపల్లి: వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.రవికుమార్ సూచించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు, దోమల నివారణపై అవగాహన కల్పించి, అప్రమత్తం చేయాలని సూచించారు. శనివారం మండలంలోని పాలెం పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు డా.ప్రియాంక, డా.శివ, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, ఏపీఓ రాజేష్, ఫార్మసీ అధికారి శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్ననూర్: ఆదివాసి గిరిజన బాలుర పాఠశాలలో (పీటీజీ) పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై తీసుకోవల్సిన పలు జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు వైద్యాధికారి సుధాకర్ సిబ్బందితో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, హెల్త్ వర్కర్ లక్ష్మన్, ఏఎన్‌ఎం ఉసేనమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి టీ సాగర్

నాగర్‌కర్నూల్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్ అన్నారు. శనివారం జిల్లా కమిటీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 నెలల కాంగ్రెస్ పరిపాలనలో ఇచ్చిన హామీలను నామమాత్రంగా అమలు చేస్తూ, పూర్తి స్థాయిలో అమలు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలు అడిగే వాటికి పార్లమెంట్‌లో సమాధానం చెప్పడం లేదని, ప్రశ్నించిన వారిని హిందూ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తుందన్నారు. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా కల్పించలేదన్నారు. ప్రజా సమస్యలపై రెండు నెలల పాటు సీపీఎం అవిశ్రాంత పోరాటానికి సిద్ధమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి హామీలను అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పర్వతాలు, ఆర్.శ్రీనివాసులు, గీత, ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



జూపల్లి బీటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

చారకొండ/కల్వకుర్తి టౌన్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, కాంగ్రెస్ ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు 3.5 కి.మీ. మేరకు రూ.9 కోట్లతో రెండు వరుసల బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, జూపల్లి నుంచి నెమలిగుట్ట తండా వరకు 3 కి.మీ. రూ.2.70 కోట్లతో ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం జేపల్లిలో 25 నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకట్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాద వ్, కార్యకర్తలు ఉన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



సీపీఐ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకొత్తపల్లి: ఆగస్టు 1,2వ తేదీల్లో కల్వకుర్తి పట్టణం లో నిర్వహించే సీపీఐ జిల్లా మూడో మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి నర్సింహ, మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొదటి రోజు కల్వకుర్తి పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మహాసభలకు ము ఖ్య అతిథులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలనర్సింహ, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

తెలకపల్లి: సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెనేపల్లి రవీందర్, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి సూర్యశంకర్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బాల మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని వట్టిపల్లిలో సీపీఐ జిల్లా 3వ మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నర్సింహ, వెంకటయ్య గౌడ్, శ్రీరాంగౌడ్ ఉన్నారు.

దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి

చారకొండ: రాబోయే స్థానిక ఎన్నికల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల సంఘం సభ్యులు శని వారం మండల కేంద్రంలో తహసీల్దార్ సునిత కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి కావలి వెంకటయ్య, శేఖర్, సైదులు, గోపయ్య ఉన్నారు.

విజేతలకు బహుమతులు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వీ గోల్డ్ జిమ్‌లో శనివారం వెయిట్ లిఫ్టింగ్, పుష్, డెట్ లిఫ్టు తదితర విభాగాలలో జిమ్ యాజమాన్యం పోటీలు నిర్వహించింది. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ యువనాయకుడు సంతుయాదవ్ హాజరై బహుమతులను అందజేశారు. రక్షిత్, శివ, శివాజీ, సూరి, హర్షిత, నాని, అజయ్, సాయి తేజ, కార్తీక్ బహుమతులు గెలుచుకున్నారు.

చదువుకుంటేనే భవిష్యత్

కల్వకుర్తి రూరల్: చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని మానవత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ రమ్య అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిల్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసూన, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు సందీప్, అంజి పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

తాడూరు: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ సందీప్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం గోదాంలో ఉన్న ఎరువులను పరిశీలించారు. రైతులకు యూరియా 3వేల బస్తాలు సిద్ధంగా ఉందని, ఉన్న స్టాక్ అయిపోకముందే లారీల ద్వారా యూరియా వస్తుందన్నారు. పాసుబుక్, ఆధార్ కార్డులు అందజేయాలన్నారు.

లింగాల: మండలంలో రైతులకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను శనివారం ఏడీఏ ఆకస్మిక తనిఖీ చేశారు. గోదాంలో ఉన్న యూరియా నిల్వలను ఆయన పరిశీలించారు. పీఏసీఎస్‌లో, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 60 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల దగ్గర మరో 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఏడీఏ తెలిపారు.

స్వామివారికి వెండి ఆభరణాల బహూకరణ

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై స్వయంభుగా వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహ స్వామికి చేయించిన వెండి ఆభరణాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తిమ్మాజిపేటకు చెందిన జోషి వేదం వెంకటేశ్వర శర్మ సతీమణి సులోచన స్వామివారికి రూ.24వేల విలువైన వెండి ఆభరణాలు చేయించారు. శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు చేసి ఆభరణాలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన జోత్స్న, శ్రీనివాస గంగాధర్ దంపతులు రూ. 10,500 విలువైన ఆభరణం అమ్మవారికి చేయించి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ, ఆలయ కమిటీ కార్యదర్శి రాంచంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కందనూలు: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి జిల్లా కేంద్రానికి చెందిన చిగుళ్లపల్లి కమలమ్మ, పుల్లయ్య, వారి మనుమడు వైభవ్ దత్త పుట్టినరోజు సందర్భంగా స్వామివారికి 55 తులాల వెండి ఆభరణం గోవింద క్షేత్ర ఆలయ కమిటీ అధ్యక్షుడు మలిశెట్టి నరసింహకు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

వెల్దండ: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ దేవాలయ నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, యాదగిరి, ఆనంద్, నిరంజన్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

తాడూరు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాల్సి ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భరత్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని అంతారంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 1, 2 తేదీలలో కల్వకుర్తి పట్టణంలో పార్టీ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, మహేష్, లక్ష్మన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

దుందుభీ వాగులో రక్షణ చర్యలు

కల్వకుర్తి రూరల్: దుందుభీ నది ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు నది చెక్ డాములు దాటుకుంటూ మండలంలోని రఘుపతిపేట రామగిరి మధ్య ప్రవహిస్తోంది. వాగులో ప్రమాదాలు సంభవించకుండా బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు రాకుండా శనివారం అధికారులు పనులు చేపట్టారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా జేసీబీతో నీటిని మళ్లించే పనులు చేపట్టారు. తహసీల్దార్ ఇబ్రహీం దుందుభి వాగు వద్ద పనులు పర్యవేక్షించారు. ఆర్టీసీ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా బస్సులు నిలిపేశారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దారు ఇబ్రహీం సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ రావూఫ్ ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలి

కోడేరు: మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌కు వెళ్లే రహదారిపై సీసీరోడ్డు నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు మహేష్ డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థులతో కలిసి రోడ్డుపై నిరసన తెలిపారు. వర్షాకాలం కావడంతో పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు బురదలో కిందపడి గాయాలైన సంఘటనలున్నాయని తెలిపారు. సీసీరోడ్డు నిర్మించకుంటే ఆందోళన చేపడుతామన్నారు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలి

కోడేరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగరాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పని చేసి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, లాలు, బాలునాయక్, తులసీరాం పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

నాగర్‌కర్నూల్ రూరల్: మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్లో యువకులు దూరంగా ఉండాలని బీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు రామకృష్ణ సూచించారు. శనివారం పట్టణంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ విద్యాశాఖ అధికారులు రమేష్ మాట్లాడు తూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలు, ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాల, హాస్టళ్లలో ఆగస్టు1 నుంచి అక్టోబర్ 1 వరకు మత్తు పదార్థాలకు వ్యతిరేక కార్యక్రమాలు బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, రాంచందర్, సురేష్, సమద్‌పాష, భరత్, సంతోష్ పాల్గొన్నారు.